కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )
మంగళవారం 14, మే 2024 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ



## క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

4 లో

# పోలింగ్ ప్రశాంతం

- ఖమ్మం ఎంపీ స్థానానికి 75.19శాతం పోలింగ్
- భద్రాద్రి జిల్లాలో ఎన్నికల విధుల్లో ఒకరు మృతి
- రెండు చోట్ల ఓటర్ల నిరసన..ఆలస్యంగా పోలింగ్
- ఓటేసిన ప్రముఖులు, జిల్లా అధికారులు



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ఎట్టకేలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ పూర్తిగా అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం పార్లమెంటు స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 75.19 శాతం పోలింగ్ నమోదైంది. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని మధిర, ఖమ్మం, సత్తుపల్లి, వైరా, పాలేరు, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో స్వల్ప ఘటనలు మినహా అంతా ప్రశాంతంగా మిగతా 2లో..

## అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నా

- ఓటర్లు నా పక్షానే నిలిచారు
- నేను చేసిన అభివృద్దే నన్ను గెలిపిస్తుంది
- బీఆర్ ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బిఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరావునియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలనుసందర్శించి ఓటర్లను కలిసి పోలింగ్ సరళిని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఓటర్లు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే ఫోన్ లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు .వైరా మండలం తాటిపూడి పోలింగ్ కేంద్రాన్ని మిగతా 2లో..

## అందరికీ కృతజ్ఞతలు

- తాండ్ర వినోద్ రావు



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

కొద్దిసేపటి కిందట ముగిసిన పోలింగ్‌లో ఓటు హక్కు వినియో గించుకుని భారతీయ జనతా పార్టీని నిండు మనసుతో దీవించిన ఓటరు మహాశయులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. మీకు దేశం మీద ఉన్న భక్తి, మోడీ జీ మీద ఉన్న ప్రేమ నన్ను మంచి మెజారిటీతో గెలిపించి పార్లమెంటుకు పంపుతాయన్న మిగతా 2లో..



## ఓటు కోసం సప్త సముద్రాలు దాటి...

- అమెరికా నుంచి నేరుగా మధిర వచ్చి ఓటు వేసిన యువ ఓటర్లు..
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న పూట్ల సాయి తేజశ్రీ సాయి భవ్యశ్రీ లు..

3 లో

# పోలింగ్ ప్రశాంతం

| నియోజకవర్గం | మొత్తంఓటర్లు | పోలైన ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| ఖమ్మం | 3,24,073 | 2,02,546 | 62.50 |
| పాలేరు | 2,40,806 | 2,00,591 | 83.30 |
| మధిర | 2,22,160 | 1,80,616 | 81.30 |
| వైరా | 1,93,389 | 1,55794 | 80.56 |
| సత్తుపల్లి | 2,43,943 | 1,95,154 | 80.00 |
| కొత్తగూడెం | 2,47,494 | 1,63,767 | 66.17 |
| అశ్వారావుపేట | 1,59,174 | 1,27,912 | 80.36 |
| మొత్తం | 16,31,039 | 12,26,381 | 75.19 |

**2019, 2024 లోక్ సభ ఎన్నికల పోలింగ్ (శాతం) సరళి ఇలా...**

| నియోజకవర్గం | 2019 | 2024 |
|---|---|---|
| ఖమ్మం | 65 | 62.50 |
| పాలేరు | 82 | 83.30 |
| మధిర | 80 | 81.30 |
| వైరా | 78 | 80.56 |
| సత్తుపల్లి | 77 | 80.00 |
| కొత్తగూడెం | 66 | 66.17 |
| అశ్వారావుపేట | 77 | 80.36 |
| మొత్తం | 75.30 | 75.19 |

(మొదటి పేజీ తరువాయి..)

ముగిసింది. ముఖ్యంగా ఖమ్మం ఎంపీ స్థానానికి జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గంలో మొత్తం 75.19శాతం పోలింగ్ నమోదు కాగా, అందులో అత్యధికంగా పాలేరు నియోజకవర్గంలో 83.30శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా ఖమ్మం నియోజకవర్గంలో 62.50శాతం పోలింగ్ నమోదైంది. ఇదిలా ఉండగా తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో రెండు గ్రామాల్లో పోలింగ్‌ను బహిష్కరించిన ఓటర్లను ఎన్నికల అధికారులు తక్షణమే ఆయా గ్రామాలను సందర్శించి ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాయ మాదారం గ్రామంలో ఎన్ఎస్పీ కాలువపై వంతెన నిర్మించాలనీ నిరసనకు దిగారు. కొత్తగూడెం సమీపంలోని లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలోనూ గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోలింగ్‌ను బహిష్కరించారు. ఈ రెండు గ్రామాల్లో అధికారులు వెంటనే స్పందించి గ్రామస్తులతో మాట్లాడి పోలింగ్ ప్రక్రియను ఆరంభించారు. పోలింగ్ విధులు నిర్వర్తించేందుకు గాను అశ్వారావుపేటలో ఏపీఓగా విధులకు హాజరైన శ్రీ కృష్ణ అనే ఉద్యోగి గుండెపోటుతో హఠాన్మరణంచెందారు.

**నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం వివరాలు ఇలా..**

ఖమ్మం పార్లమెంటు స్థానానికి గాను సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మొత&o 75.19శాతం పోలింగ్ నమోదు కాగా అందులో వివిధ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి... ఖమ్మం నియోజకవర్గంలో 62.50 శాతం పోలింగ్, పాలేరు 83.30 శాతం పోలింగ్, మధిర 81.30శాతం, వైరా 80.56శాతం, సత్తుపల్లి 80శాతం, కొత్తగూడెం 66.17శాతం, అశ్వారావుపేట నియోజకవర్గానికి 80.36శాతం పోలింగ్ నమోదైంది.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ముగ్గురూ వారి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, తాజా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మంలోని ఎన్ఎస్టీ రోడ్‌లోని కవిత పీజీ కాలేజీలో ఉదయం 9గంటలకు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తన స్వగ్రామం భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి తన ఓటు హక్కును మహబూబాబాద్ మండలం మాదాపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన కుటుంబ సమేతంగా ఖమ్మంలోని ఎన్ఎస్టీ రోడ్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ కాలేజీలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ఎవరెక్కడ ఓటేశారంటే...?**

జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆయన కుటుంబ సభ్యులు మధిరలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం గొల్లగూడెం మండల పరిషత్ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వారి స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో తన కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మంలో ఓటు హక్కు వినియోగించుకోగా, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వారి స్వగ్రామం తిర్మలాయ పాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల శాసనసభ్యులు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి వారి వారి నియోజకవర్గ కేంద్రాల్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్, బానోత్ మదన్‌లాల్, తదితరులు వారి వారి నియోజకవర్గాల్లో ఓటు హక్కును వినియోగించకున్నారు. 18వ పార్లమెంటు ఎన్నికల్లో సోమవారం ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల వారి ఓటు హక్కును వారి జిల్లా కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇరు జిల్లాల ఎస్పీలు ఉమ్మడి జిల్లాలో సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేసి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పర్యవేక్షించారు.

# అందరికీ కృతజ్ఞతలు

(మొదటి పేజీ తరువాయి..)

నమ్మకం నాకుంది. ఈ గడ్డ బిడ్డగా మీకు సేవ చేసుకునే అవకాశం లభించడం గొప్ప అదృష్టంగా భావిస్తాను. మీ ప్రేమ, అభిమానం ఎన్నటికీ మరువలేనివి. ప్రచార పర్వంలో నాకు వెన్నంటి ఉన్న నాయకులకు, నాతో కదం కలిపిన కార్యకర్తలకు, కళా బృందాలకు, సాంకేతిక సిబ్బందికి నా ధన్యవాదాలు. మండే ఎండలో మీరంతా నా వెన్నంటి ఉండడం నాకు ఎంతో బలాన్ని ఇచ్చింది. అద్భుతమైన కవరేజ్ తో నన్ను ప్రజల దగ్గరకు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన ప్రింట్, టెలివిజన్ జర్నలిస్టులకు, యూ ట్యూబ్ ఛానళ్ళకు,ఈ - న్యూస్ పేపర్లకు ధన్యవాదాలు. ప్రచార పర్వంలో అనుమతుల విషయంలో మాకు సహకరించిన రిటర్నింగ్ అధికారి గారికి, ఎలక్షన్ కమిషన్ బృందానికి కృతజ్ఞతలు.

# అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నా



(మొదటి పేజీ తరువాయి..)

సందర్శించి నప్పుడు గదిలో ఒక ట్యూబ్ లైట్ మాత్రమే ఉండడం వల్ల సరిగా కనిపించడం లేదని ఓటర్లు సమస్యను నామ దృష్టికి తీసుకురాగా నామ సత్వరమే స్పందించి కలెక్టర్ కి ఫోన్ చేసి సమస్యను వివరించి, పరిష్కరించారు. ఖమ్మం కవిత పేజీ కాలేజీ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించు కున్న నామ నాగేశ్వరరావు తర్వాత పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడుపరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన ఖమ్మం కవిత పిజి కాలేజ్ పోలింగ్ కేంద్రంతో పాటు శాంతి నగర్, ఎస్ ఆర్ బి జి ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పోలింగ్ కేంద్రంతో పాటు తనికెళ్ళ, కొణిజర్ల, వైరా, సోమవరం,రెబ్బవరం, తాటిపూడి ,తల్లాడ ,అన్నారుగూడెం, బోనకల్ మండలం రావినూతల, ముష్టికుంట్ల, చింతకాని మండలం నాగులవంచ తదితర పోలింగ్ కేంద్రాలను నామ నాగేశ్వరరావు సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు .పోలింగ్ శాతాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు .

**నేనే గెలుస్తున్నా...**

ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ జరిగిన తీరును బట్టి ఓటర్లు బీఆర్ఎస్ పక్షానే నిలిచారని అన్నారు. తాను అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నట్లు నామ స్పష్టంచేశారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్ల మనోభావాలు తెలుసుకున్నానని, ఓటర్లు బీఆర్ఎస్ పార్టీ పక్షానే నిలిచి కెసిఆర్ కు అండగా ఉన్నట్లు తెలుస్తోందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తాను అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు .తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ,సంక్షేమ కార్యక్రమాలు ,పని చేసిన తీరు, రైతు బిడ్డగా తనను జిల్లా ఓటర్లు ఆదరించారని భావిస్తున్నానని చెప్పారు.

కెసిఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ,సంక్షేమ ఫలాలు అనుభవించిన ఖమ్మం జిల్లా ఓటర్లు తనకు ఓటు వేసి కేసీఆర్ కు అండగా నిలిచారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తాను రెండు సార్లు గెలిచి పార్లమెంట్‌కు వెళ్లి ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశానని, జిల్లా సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాల పైన కేంద్రాన్ని ప్రశ్నించి అనేక సమస్యలను పరిష్కరించానని చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ,పెండింగ్ ప్రాజెక్టులు , రైల్వే ప్రాజెక్టులు, విభజన సమస్యల పైన గళమెత్తి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడానని చెప్పారు ఈ జిల్లా రైతు బిడ్డ నైన తాను నిత్యం జిల్లా ప్రజలతో ఉంటూ వారికి అండగా ఉండి వారితో మమేకమై ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకొని అండగా ఉన్నానని చెప్పారు. గత ఎన్నికల్లో మోసపూరిత హామీలతో ప్రజల వంచించిన కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయం చవి చూడటం ఖాయమని తేలిపోయిందనిన నామ స్పష్టం చేశారు. తనకు ఓటు వేసిన ఖమ్మం జిల్లా ఓటర్ల అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నామ పేర్కొన్నారు .అలాగే తన విజయం కోసం మొదటి నుంచి చివరి వరకు రేయింబవళ్లు తనకు అండగా నిలిచి క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పని చేసిన జిల్లా, మండల , గ్రామ, బూత్ స్థాయి నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలుతెలియజేస్తున్నానని నామ పేర్కొన్నారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న నామ కుటుంబం**

ఖమ్మం నగరం లోని ఎన్ ఎస్ టీ రోడ్డు లో ఉన్న కవిత పీజీ కళాశాల లోని పోలింగ్ బూత్ లో బీ.ఆర్.యస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు - చిన్నమ్మ దంపతులుతో పాటు వారి కుటుంబ సభ్యులు నామ సీతయ్య, నామ రామారావు, నామ కృష్ణయ్య, నామ పృధ్వి తేజ, నామ భవ్య తేజ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు కోసం సప్త సముద్రాలు దాటి...

- **అమెరికా నుంచి నేరుగా మధిర వచ్చి ఓటు వేసిన యువ ఓటర్లు..**
- **పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న వూట్ల సాయి తేజశ్రీ సాయి భవ్యశ్రీ లు..**



**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ సరళని పరిశీలిస్తే ఎంతోమంది ఓటు ఉన్నప్పటికీ పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉన్నప్పటికీ ఓటు వేయటానికి సుముఖత చూపకపోవడం గమనిస్తూనే ఉన్నాం.. కానీ ఓటు అనేది భవిష్యత్ తరాలకు పునాది అని ఓటు ఎంత విలువైనదో తెలుసుకుని వ్యయ ప్రయాసులను లెక్కచేయకుండా మన మధిర కి చెందిన వుట్ల వేణుబాబు కుమార్తెలు సాయి తేజశ్రీ సాయి భవ్య శ్రీ లు అమెరికా నుండి నేరుగా మధిరకు వచ్చి సిపిఎస్ పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకొని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

## ఓటు మన వజ్రాయుధం:డా.కావ్యచంద్



**ఖమ్మం, మే13, కెరటం న్యూస్:** డా.బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా సాధించుకున్న ఒటు హక్కును ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలలో దేశ ప్రజలు లౌకికవాదాన్ని నిలబెట్టే విధంగా ఆలోచించాల్సిన బాధ్యత ప్రతీ భారతీయ పౌరునిపై ఉందని ఖమ్మం నగరం లో ప్రముఖ వైద్యురాలు డా.కావ్యచంద్ యాలముడి, ఆమె తండ్రి, కావ్య హాస్పిటల్స్ చైర్మన్ రవిందర్ యాలముడి అన్నారు. ఖమ్మంలోని ఓ సెంటర్ లో పోలింగ్ బూత్ లో వారు తన ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న లౌకికవాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని బతికించాలంటే దేశవ్యాప్తంగా యువత తప్పకుండా ఓటు వెయ్యాలని వారు కోరారు. ఎన్నికలలో ప్రజలు చైతన్యవంతంగా విజ్ఞతతో లౌకికవాదాన్ని ప్రజాస్వామ్యాన్ని బతికించేలా ఓటు ద్వారా తమ తీర్పు ఉండాలని వారు కోరారు. తప్పకుండా తమ ఓటు ద్వారా ప్రజా నాయకులను ఎన్నుకుని ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా తీర్పు ఇవ్వాలని డా. కావ్య, రవిందర్ కోరారు.

# మధిరలో ముమ్మరంగా పోలింగ్

- **5 గంటలకే 80% పైగా పోలింగ్ నమోదు**
- **సుందరయ్య నగర్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు.**











**మధిర కెరటం న్యూస్:** ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం లో ముమ్మరంగా పోలింగ్ జరిగింది ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో మిగతా నియోజకవర్గాల కన్నా పోలింగ్లో అత్యధిక శాతం నమోదవుతూ వచ్చింది. నియోజకవర్గంలో పోలింగ్ బూతుల్లో మాక్ పోలింగ్ అనంతరం పోలింగ్ ప్రారంభించగానే ఓటర్లు ముఖ్యంగా మహిళలు పోటీత్తారు ప్రతి గంటకు అత్యధిక శాతం పోలింగ్ నమోదవుతూ వచ్చింది. వృద్ధులు వికలాంగులు ఆటోల్లో మరియు టూవీలర్ మీద వచ్చి ఇతరుల సహాయంతో ఓటు హక్కు వినియోగించుకున్నారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర లో సుందరయ్య నగర్ లోని పోలింగ్ కేంద్రం వద్ద ఆయన సతీమణి మల్లు నందిని విక్రమార్క మరియు కుమారుడు సూర్య విక్రమార్క లతో కలిసి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో బలమైన ఆయుధం అన్నారు పాలకులను రక్షించినా శిక్షించినా ఓటే ఆయుధం అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్య రక్షణకు పూనుకోవాలి అన్నారు. అదేవిధంగా నియోజకవర్గం లో చాలామంది ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు వైరా నియోజకవర్గం లో కొస్తాల గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ఖమ్మంపాడు గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాదం, మున్సిపల్ చైర్మన్ లతా జయకర్ మధిరలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మదిర నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చి యువత మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## లౌకికవాదాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి..

- **సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి కా.పోటు రంగారావు పిలుపు**



**ఖమ్మం, మే13, కెరటం న్యూస్:**ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలలో దేశ ప్రజలు లౌకికవాదాన్ని నిలబెట్టే విధంగా ఆలోచించాల్సిన బాధ్యత ప్రతీ భారతీయ పౌరునిపై ఉందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని ఇందిరానగర్ కాలనీ 102 వ పోలింగ్ బూత్ లో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... భారత దేశంలో లౌకికవాదం ప్రమాదంలో పడిందనీ.. బిజెపి మతతత్వ విధానాలతో దేశ ప్రజలు రెండుగా విభజించబడ్డారని ఆయన ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఉన్న లౌకికవాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని బతికించాలంటే దేశవ్యాప్తంగా బిజెపిని చిత్తుగా ఓడించాల్సిన అవసరం ప్రతి భారతీయునిపై ఉందని పోటు రంగారావు అన్నారు. నేడు జరిగే ఎన్నికలలో ప్రజలు చైతన్యవంతంగా విజ్ఞతతో లౌకికవాదాన్ని ప్రజాస్వామ్యాన్ని బతికించేలా ఓటు ద్వారా తమ తీర్పు ఉండాలని ఆయన కోరారు. తప్పకుండా తమ ఓటు ద్వారా ప్రజా నాయకులను ఎన్నుకుని ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్సీ తాతా మధు




**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ కేంద్రాల వద్దకు వెళ్లి ప్రజాప్రతినిధులను, నాయకులను కార్యకర్తలను కలిసి ఓటింగ్ శాతం పెరిగే విధంగా కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని వైరా, మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల లోని వివిధ ప్రాంతాల్లో పోలింగ్ బూతుల వద్దకు వెళ్లి జరుగుతున్న పోలింగ్ తీరును స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ పరిశీలించారు.

# ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ స్థానాలు గెలుస్తున్నాం

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు ధీమా
- కుటుంబ సమేతంగా ఖమ్మంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**ఖమ్మం బ్యూరో, మే13, కెరటం న్యూస్ :** 18వ పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాలకు జరిగిన ఎన్నికలలో ఖమ్మం ఎంపీగా నామ నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీగా మాలోత్ కవిత బీఆర్ఎస్ ఎంపీలుగా విజయం సాధిస్తారని ఎంపీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం ఎన్ ఎస్ టి రోడ్ లోని



డా.బీ అర్ అంబేద్కర్ కాలేజీ లోని పోలింగ్ బూత్ లో కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖమ్మం ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే రెండు స్థానాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన కేసీఆర్ ను ప్రజలు గుండెల్లో పెట్టుకొని ఎన్నికల్లో టిఆర్ఎస్ కు మద్దతు పలకనున్నారని ఆయన అన్నారు. దేశంలోనే మరే రాష్ట్రంలోనూ అమలు చేయని సంక్షేమ పథకాలను అందించిన బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పకుండా మళ్లీ ప్రజా మద్దతుతో అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.

# క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం క్రైం, కెరటం న్యూస్ ప్రతినిధి:** లోకసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను పోలీసు కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ఖమ్మం రూరల్ డివిజన్ పరిధిలోని యం.వి.పాలెం, తెల్దారుపల్లి, పిండిప్రోలు, కాచిరాజుగూడెం, ఖమ్మం నగరంలోనిరమణగుట్ట, SR& BGNR కాలేజ్, వైరా , ఏన్కూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలపై పోలింగ్ అధికారులతో మాట్లాడారు. ఏవరికి ఇబ్బందులు లేకుండా వరుస క్రమంలో వెళ్లి ఓటును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. క్రమపద్ధతిలో పోలింగ్ బూత్ లోనికి ఓటర్లను అనుమతించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అలాగే ఓటు వేసిన వారిని పోలింగ్ కేంద్రాలలో వేచి ఉండకుండా బయటకు పంపించాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే ఓటింగ్‌కు వచ్చేవారి వాహనాల పార్కింగ్ చేసుకునేలా, పోలింగ్ స్టేషన్లకు వచ్చిపోయే వారికి అంతరాయం కలగకుండా అన్నిచర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల బందోబస్తు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

# ఇండియా కూటమి అభ్యర్థికి సహకరించిన వారికి కృతజ్ఞతలు: నున్నా నాగేశ్వరరావు

- వివిధ బూత్‌లను పరిశీలన చేసిన సీపీఎం జిల్లా నాయకులు

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** సోమవారం జరిగిన ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఖమ్మం నగరంలో వివిధ ఎన్నికల బూత్ లను సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, వై విక్రమ్ పరిశీలన చేసారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇండియా కూటమి భాగంగా ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేసిన సీపీఎం పార్టీ శ్రేణులకు, కూటమి అభ్యర్థికి



మద్దతుగా నిలిచిన వివిధ పార్టీల కార్యకర్తలకు, పార్లమెంటు వ్యాప్తంగా ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురామ్ కు ఓట్లు వేసి ప్రజలందరికీ సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

# మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఏఎస్పీ పంకజ్ పరిశీలన



**భద్రాచలం, కెరటం న్యూస్ ప్రతినిధి:** భద్రాచలం సబ్ డివిజన్లోని చర్ల మరియు దుమ్ముగూడెం మండలాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ సందర్శించారు. ఎప్పటికప్పుడు అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తూ పోలింగ్ సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకోవడం జరుగుతుంది. చర్ల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,చర్ల మండలం దోసిల్లపల్లి పోలింగ్ బూత్ ల వద్ద బందోబస్త్ ను పర్యవేక్షించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ గారి సూచనలతో భద్రత బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేయడం జరిగిందని ఏఎస్పీ ఈ సందర్భంగా తెలియజేసారు.ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిర్భయంగా పాల్గొంటున్నారని తెలిపారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు.

# పోలింగ్ ప్రశాంతం...

- హర్షం వ్యక్తం చేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల



**కొత్తగూడెం బ్యూరో, కెరటం న్యూస్:**పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశా ంతంగా ముగియడం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుండి, నోటిఫికేషన్ ఏప్రిల్ 18 నాటి నుంచి మే 13 పోలింగ్ ప్రక్రి య ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహ కారాలు భాగస్వామ్యం మరువలేనిదని ఆమె పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరిం చిన ప్రతి ఒక్కరికి ఆమె అభినందనలు తెలియజేశారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతమైన మన జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహిం చడం ఎంతో అభినందనీయమని, ఎన్నికల నిర్వహణలో భాగస్వాము లైన అధికారులకు, అనధికారులకు, జిల్లా ప్రజలకు, పాత్రికేయులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ తాతా





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్ తన స్వగ్రామం తిరుమలయాపాలెం మండలం, పిండిప్రోలు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల జడ్పీ హైస్కూల్ నందు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి..



**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్:** ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి తమ వంతుగా బాధ్యత తీసుకొని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలని త్రివేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం ఖమ్మం లోని ఎస్సార్ అండ్ బీజీ ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమన్నారు. వజ్రాయుధం లాంటి ఓటును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి పువ్వాడ దంపతులు



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు జరుగుతున్న ఎన్నికల్లో మాజీ మంత్రి పువ్వాడ దంపతులు అజయ్ కుమార్ గారు, వారి సతీమణి పువ్వాడ వసంతలక్ష్మీ హార్వెస్ట్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో హాజరై తమ ఓటును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.









ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు













